# మున్సిపల్ ఎన్నికలకు జగిత్యాల సిద్ధం



• కలెక్టర్ బి. సత్యప్రసాద్

**నేటి సాక్షి, జగిత్యాల:** జగిత్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రకటించారు. మంగళవారం ఆయన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గారితో కలిసి జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల్లోని ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ కేంద్రాలను స్వయంగా సందర్శించి, ఏర్పాట్లను సమీక్షించారు.

## క్షేత్రస్థాయిలో పకడ్బందీ తనిఖీలు

ఎన్నికల సామగ్రి పంపిణీ తీరును పరిశీలించిన కలెక్టర్, బ్యాలట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు మరియు ఇతర లాజిస్టిక్స్ సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి కేటాయించిన బస్సుల సౌకర్యం మరియు వారు బస చేసే ప్రాంతాల్లో కనీస వసతులపై ఆరా తీశారు. ముఖ్యంగా సిబ్బందికి అందించే భోజనం విషయంలో నాణ్యత, పరిశుభ్రత పాటించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## గణాంకాలు మరియు పర్యవేక్షణ

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల (జగిత్యాల, ధర్మపురి, రాయికల్, కోరుట్ల, మెట్‌పల్లి) పరిధిలో ఎన్నికల నిర్వహణకు భారీ ఏర్పాట్లు జరిగాయి:

**మొత్తం వార్డులు: 136**
**ఓటర్ల సంఖ్య: 2,31,627**
**పోలింగ్ కేంద్రాలు: 379**
నిర్వహణ సిబ్బంది: 455 మంది పీవోలు, 455 మంది ఏపీవోలు, 1,637 మంది ఇతర సిబ్బంది.

## వెబ్‌కాస్టింగ్ ద్వారా నిఘా

ఎన్నికల పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పోలింగ్ సరళిని అధికారులు నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేసేందుకు 96662 34383 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడకూడదని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వాతావరణం కల్పించాలని కలెక్టర్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మున్సిపాలిటీల స్పెషల్ ఆఫీసర్లు, కమిషనర్లు మరియు తహసీల్దార్లు పాల్గొన్నారు.

# తడి బట్టలతో దుర్గామాత ఆలయంలో అభ్యర్థి ప్రమాణం

**నేటి సాక్షి కోరుట్ల.రాధారపు నర్సయ్య :** మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడే చివరి క్షణాల్లో కోరుట్ల పట్టణంలోని 31వ వార్డులో తీవ్ర ఉద్రిక్తత, భావోద్వేగ పరిస్థితులు నెలకొన్నాయి. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎలుగూరి శ్వేతా–కిరణ్ దంపతులు ప్రత్యర్థుల విమర్శలకు నిరసనగా వినూత్న రీతిలో స్పందించారు, గత కొద్ది రోజులుగా ప్రత్యర్థులు తనపై లేనిపోని అభాండాలు వేస్తున్నారని, తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా దుష్ప్రచారం చేస్తున్నారని అభ్యర్థి భర్త కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రచార గడువు ముగిసేలోపు తన నిజాయితీని నిరూపించుకోవాలనే పట్టుదలతో, ఆయన ప్రజల ముందే తన భార్య శ్వేత తలపై బకెట్‌తో నీళ్లు పోసి, తాను కూడా తలస్నానం చేశారు.

## అమ్మవారి సాక్షిగా ప్రమాణం

నడిరోడ్డుపై తలస్నానం చేసిన అనంతరం, అభ్యర్థి దంపతులు అదే తడి బట్టలతో స్థానిక దుర్గాదేవి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి పాదాల చెంత నిలబడి.. తాము





ఎలాంటి తప్పు చేయలేదని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని దైవసాక్షిగా ప్రమాణం చేశారు. "నేను అనని మాటలను అన్నట్లుగా వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. నేను తప్పు చేసి ఉంటే ఆ దుర్గాదేవే నన్ను శిక్షిస్తుంది." – ఎలుగూరి కిరణ్, అభ్యర్థి భర్త. అభ్యర్థి దంపతులు కన్నీటి పర్యంతం కావడంతో వార్డులోని మహిళలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. వారిని ఓదార్చుతూ, "మేము మీకు అండగా ఉన్నాం, అధైర్యపడకండి" అంటూ సముదాయించారు. దీంతో కాసేపు అక్కడ ఉద్రిక్తత కొనసాగినప్పటికీ, మహిళల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. ఎన్నికల పోలింగ్‌కు ముందు జరిగిన ఈ ఘటన కోరుట్ల పట్టణ వ్యాప్తంగా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# ఎన్నికల ఏర్పాట్లపై నారాయణపేట కలెక్టర్ ఆకస్మిక తనిఖీ






**నేటి సాక్షి నారాయణపేట ఇమామ్ సాబ్:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ సిక్తా పట్నాయక్ గారు జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద ఉన్న గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని (ఙఅర్‌తీఅఎబ్‌అశీఅ జవత్‌వతీ) సందర్శించి, ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

## కలెక్టర్ జారీ చేసిన కీలక ఆదేశాలు

పోలింగ్ సిబ్బందికి సామాగ్రిని అందించే సమయంలో ఎటువంటి గందరగోళం ఉండకూడదని, చెక్ లిస్టు ప్రకారం అన్ని వస్తువులు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ పేపర్లు మరియు ఇతర కీలక ఎన్నికల సామాగ్రి తరలించేటప్పుడు ఖచ్చితంగా సాయుధ పోలీసుల బందోబస్తు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్ మరియు ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుల కోసం ర్యాంపులు, వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలని, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. "ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి అధికారి మరియు సిబ్బంది ఎంతో అప్రమత్తతో వ్యవహరించి, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా చూడాలి." సిక్తా పట్నాయక్, జిల్లా కలెక్టర్

## ముందస్తు చర్యలు:

ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఆర్వో (RO) లేదా స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రామచందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మరియు ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# జీవవైవిద్యం లేకపోతే జీవితం లేదు ప్రజాకవి జయరాజు

• ప్రకృతిని కాపాడితే అదే మనల్ని కాపాడుతుంది తాటి రమేష్

**నేటిసాక్షి, మిర్యాలగూడ:** ప్రతి ఒక్కరు జీవవైవిద్యాన్ని కాపాడుకోవాలని, జీవవైవిధ్యం లేకపోతే ప్రతి మనిషి మనుగడ కష్ట సాధ్యమవుతుందని ప్రజాకవి ప్రకృతి కవి జయరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రకృతి వైజ్ఞానిక యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ, విద్యార్థులు మూఢనమ్మకాలు నమ్మకుండా ప్రకృతిలో జరిగే మార్పులను గమనిస్తూ, ప్రతి ఒక్కరూ ప్రకృతి ప్రేమికులుగా మారాలని, అప్పుడే సమాజం అభివృద్ధి చెందగలదని అన్నారు. అనంతరం విజ్ఞాన దర్శిని జాతీయ పౌండర్ తాటి రమేష్ మాట్లాడుతూ, పాఠ్యాంశాలలో చదివిన సైన్స్ ని మూఢనమ్మకాలకు జోడించకుండా, సైన్స్ అంటే ఏమిటి అనే జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చేసుకుని, సామాజిక





అంశాలతో సైన్స్ కు గల సంబంధాన్ని తెలుసుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ, సైన్సు అభివృద్ధి చెందని కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో అనేక మూఢనమ్మకాలు ఉండేవని, అక్షరాస్యతా అంతగా లేక పేదరికంలో ఉండి మూఢ విశ్వాసాలను ఆనాడు విశ్వసించే వారని, నేటి కాలంలో అక్షరాస్యత పెరిగినప్పటికీ మూఢవిశ్వాసాలు నానాటికి పెరగడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ బాడీ నేత్రదానం డొనేషన్ గంజి ఈశ్వర లింగం, విజ్ఞాన దర్శిని నాయకురాలు మంగమ్మ, శోభారాణి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, జె కొండల్ రెడ్డి, మరో గ్రంథాల ఉద్యమ నేత కస్తూరి ప్రభాకర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ విజయకుమార్, ప్రిన్సిపాల్ కృష్ణ నాయక్, ఏఐడీఎఫ్ నాయకులు కాశయ్య, వస్కుల మట్టయ్య, అభిద్ భాష, లక్ష్మణ్, అశోక్, నరేష్, మధు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం

విజయవంతం



**నేటి సాక్షి, నారాయణపేట ఇమామ్ సాబ్:** ధన్వాడ మండలం కిస్టాపూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. శిబిరంలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ శిబిరాన్ని డా. జయచంద్రమోహన్ ప్రారంభించి ఆరోగ్యంపై అవగాహన సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో డా. అనూష, సూపర్వైజర్‌లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఖిలావనపర్తిలో జనం బాట



**నేటి సాక్షి, ధర్మారం:** ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ మోతే కనకయ్య ఆధ్వర్యంలో జనం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడో వార్డును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులోని తాగునీరు, కరెంట్ సరఫరా, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, పింఛన్లు తదితర సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను సర్పంచ్ నమోదు చేసుకొని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోతే కావ్య వెంకటస్వామి, మూడో వార్డు సభ్యుడు తోడేటి సాగర్, వీవోలు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సెలవు



**నేటి సాక్షి, మంచిర్యాల :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ నెల 11న మున్సిపల్ పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. అర్హత గల ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

# చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

విద్యార్థికి గాయాలు



**నేటి సాక్షి - మెట్పల్లి:** మల్లాపూర్ మండలం ఓబులాపూర్ గ్రామ శివారులో ప్రైవేట్ స్కూల్ బస్సు ప్రమాదానికి గురైంది. పిల్లలను స్వగ్రామాలకు దింపేందుకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి బస్సు చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాత దంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డల హనిష్ అనే విద్యార్థికి గాయాలు అయ్యాయి. గాయపడిన విద్యార్థిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఘటనపై స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

# 31 పోలింగ్ స్టేషన్లకు

మెటీరియల్ పంపిణీ




**నేటి సాక్షి, శంకర్‌పల్లి;** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల ఎన్నికల కోసం 31 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ యోగేష్ తెలిపారు. మంగళవారం పోలింగ్ సిబ్బందికి అవసరమైన మెటీరియల్ పంపిణీ చేసి, వారిని ఆయా పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా తరలించినట్లు పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట భద్రత

**• ఎస్పీ డాక్టర్ వినీత్**

**నేటి సాక్షి నారాయణపేట ఇమామ్ సాబ్:** జిల్లాలో రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. నారాయణపేట, మక్తల్, కోస్గి, మరియు మద్దూర్ మున్సిపాలిటీల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### 800 మంది పోలీసులతో భారీ నిఘా

ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా సుమారు 800 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. ఇందులో 550 మంది పోలీసు అధికారులు మరియు సిబ్బంది. 28 రూట్లుగా విభజించి, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో రిజర్వ్ టీమ్స్ మరియు స్ట్రైకింగ్ ఫోర్స్‌ను సిద్ధం చేశారు. నారాయణపేటలోని SR గార్డెన్ మరియు కోస్గిలోని పంచాక్షరి ఫంక్షన్ హాల్‌లలో సిబ్బందికి విధులకు సంబంధించిన నిబంధనలపై ఎస్పీ గారు స్వయంగా దిశానిర్దేశం చేశారు. అమల్లో 144 సెక్షన్ (163 BNS) శాంతిభద్రతల దృష్ట్యా ఎన్నికలు జరిగే నాలుగు మున్సిపాలిటీల్లో 144 సెక్షన్ (163 దీహీ) అమలులో ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా ఉండటం నిషిద్ధం. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు

పోలింగ్ కేంద్రం నుండి 100 మీటర్ల వరకు ముగ్గుతో మార్కింగ్ చేసి, అనవసర వ్యక్తులు లోపలికి రాకుండా నిరోధిస్తారు. వాహనాల పార్కింగ్ 200 మీటర్ల దూరంలోనే ఉండాలి. నిషేధిత వస్తువులు: పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఇంక్ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు, మరియు ఇతర మందుగుండు సామగ్రిని తీసుకువెళ్లడం పూర్తిగా నిషేధించారు. పోలింగ్ బూత్‌లలో ఓటు వేసిన తర్వాత గానీ, వేస్తున్నప్పుడు గానీ సెల్ఫీలు దిగడంపై నిషేధం విధించారు. ప్రజాస్వామ్య ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించే



రూట్ మొబైల్ అధికారులకు సమన్వయం అందించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హాక్, సిఐలు, ఎస్ఐలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లాలో పోలింగ్‌కు సర్వం సిద్ధం



**• కలెక్టర్ కుమార్ దీపక్**

**నేటి సాక్షి మంచిర్యాల :** మంచిర్యాల జిల్లాలో రేపు (ఫిబ్రవరి 11) జరగనున్న మున్సిపల్ సాధారణ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు. మంగళవారం ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ మరియు స్వీకరణ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్లతో కలిసి పలు కేంద్రాలను సందర్శించారు. లక్షెట్టిపేట, పాత మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. మంచిర్యాల, ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపలి, ఆయా మున్సిపాలిటీల్లోని హైస్కూళ్లు మరియు క్లబ్‌లలో ఏర్పాటు చేసిన పంపిణీ, స్వీకరణ మరియు లెక్కింపు కేంద్రాల సన్నద్ధతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

### ఎన్నికల షెడ్యూల్ & పర్యవేక్షణ

**పోలింగ్ తేదీ: ఫిబ్రవరి 11 (బుధవారం).**
**ఓట్ల లెక్కింపు: ఫిబ్రవరి 13 (శుక్రవారం).**

ఈసారి ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖతో పాటు అటవీ మరియు ఆబ్కారీ శాఖ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేసి సమర్థవంతమైన నిఘా ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ఓటర్లకు ఇప్పటికే ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు.

### కఠిన చర్యల హెచ్చరిక

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే అభ్యర్థులు లేదా పార్టీలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తే వెంటనే కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియలో సహకరించాలని ఆయన కోరారు.

# మద్దునూరులో మహిళా చట్టాలపై 'సఖీ' బృందం అవగాహన



**నేటి సాక్షి బుగ్గారం, జగిత్యాల:** మహిళలు మరియు బాలికలు తమ రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కట్కూరి లావణ్య అన్నారు. మంగళవారం బుగ్గారం మండలం మద్దునూరు గ్రామంలో సర్పంచ్ గాలిపెల్లి భారతి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీతో పాటు స్థానిక ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

### సఖీ కేంద్రం అందించే సేవలు

బాధిత మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని కోరుతూ సఖీ కేంద్రం ద్వారా అందే ఐదు రకాల ఉచిత సేవలను ఆమె వివరించారు:వైద్య సహాయం మరియు కౌన్సిలింగ్. పోలీస్ సహాయం. తాత్కాలిక వసతి. ఉచిత న్యాయ సహాయం (లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా).

### 181 ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ పై అవగాహన.

చట్టాలపై అవగాహన, గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు మరియు ఆడపిల్లల అక్రమ రవాణా వంటి సామాజిక అరాచకాల నుండి మహిళలు ఎలా రక్షణ పొందవచ్చో లావణ్య వివరించారు. ముఖ్యంగా బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడానికి ఉద్దేశించిన పోక్సో (గూజుూ) చట్టం మరియు దాని ద్వారా లభించే కఠిన శిక్షల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు మధుకర్, శ్రీ వాణి విద్యాలయం కరస్పాండెంట్ గాలిపెల్లి మహేష్, హెచ్.ఎం చంద్రశేఖర్, కార్యదర్శి భాస్కర్, పారామెడికల్ సిబ్బంది అనురాధ, మహిళా సాధికారత సిబ్బంది స్వప్న, గౌతమి మరియు గ్రామ వార్డు మెంబర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టిబి వ్యాధి రహిత గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుదాం






**• కల్లూరి పెద్ద మస్తానయ్య (సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్)**

**నేటి సాక్షి ,పాములపాడు:** పాములపాడులోని, మండల ప్రజా పరిషత్ కార్యాలయము మీటింగ్ హాల్ నందు ఇన్చార్జి మండల ప్రజా పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ పి.తిరుపాలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.సరళ మెడికల్ ఆఫీసర్ ఇవి.నాగ లక్ష్మిదేవి, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య, సిజెవి-రవికుమార్ ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.మద్దయ్య ల ఆధ్వర్యంలో మండల స్థాయి టిబి ముక్తు పంచాయతీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు క్షయ వ్యాధి మందుల పంపిణీ, ఫుడ్ బాస్కెట్స్ మరియు ఐపిసిపి ఫాలో అప్ కుటుంబ స్క్రీనింగ్లు, వండర్ఫుల్ లిస్ట్ లోని వారందరికీ గ్రామంలోని క్షయ వ్యాధి స్క్రీనింగ్ చేసి క్షయ రహిత గ్రామముగా తీర్చిదిద్దుటలో సర్పంచ్, గ్రామ సెక్రెటరీ హెల్త్ వెల్నెస్ సెంటర్ లో పనిచేయుచున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆరోగ్య కార్యకర్త, ఆశ వర్కర్లు గ్రామంలోని అధికారులు అందరు కలిసి టీబి ముక్త్ పంచాయతీగా తీర్చిదిద్దాలని ఇన్చార్జి మండల ప్రజా పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ టి.తిరుపాలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.సరళ, పిహెచ్సి వైద్యాధికారిణి ఈవీ.నాగలక్ష్మి దేవి, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.మద్దయ్య మరియు పంచాయతీ కార్యదర్శి కె.హిస్టో రాణి, పాములపాడు మండల హెల్త్ వెల్నెస్ సెంటర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కే.రేణుక దేవి, పి. ప్రమీల, జి.రత్నమ్మ, బి.సునీత రాణి, ఎన్.శిరీష, కె ప్రియాంక, ఎం.నాగ భారతి, పి.మాళవిక. విలేజ్ హెల్త్ సెక్రటరీలు, ఆరోగ్య కార్యకర్తలు, పి.మాధవి, ఎం.శారదమ్మ, వి.జయలక్ష్మి, సి.సుదర్శనమ్మ, పీకె.అనురాధ, బి.రమణమ్మ, డి.మరియమ్మ, ఏసి చౌడమ్మ, పాములపాడు మండలంలోని, అందరూ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరువది సంవత్సరాల పెళ్లి పుస్తకం



**నేటి సాక్షి తొగుట.. వడ్డే నరసింహులు:**
ఇరువది సంవత్సరాల వైవాహిక
జీవితంలో
చిలిపి తగాదాలు వచ్చినా
చిరునవ్వుతో చేరిపేసారు
కష్టాలు ఎన్నొచ్చిన
కలిసికట్టుగా ఎదుర్కున్నారు
సమిష్టిగా అడుగులు వేసి
సంతోషాలు మదిలో నిలుపుకున్నారు
తనువులుగా వేరైనా
అంతరంగం ఒకటై నిలిచారు
భర్త మనసెరిగిన భార్యగా మేడం
భార్య మనసు తెలిసిన భర్తగా మీరు
ఇలానే కలిసి అడుగులు వేస్తూ
అంతులేని ఆనందాలు
మీ ఇంటి అవరణలో
పరిడవిల్లాలని కోరుకుంటూ మీ ఇరువురికి హృదయ పూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# ఆలయంలో క్యూఆర్ స్కానర్లు



**నేటి సాక్షి, చౌడేపల్లి:** శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో క్యూఆర్ కోడ్ స్కానర్లను ఆలయ ఈవో, ఉప కమిషనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో ప్రారంభించారు. జనరల్ అకౌంట్, గోసంరక్షణ, అన్నదాన కార్యక్రమాల కోసం ఏర్పాటు చేసిన ఈ స్కానర్లను భక్తులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులు బంద్...

### మునిగడపలో గ్రామస్తుల సమష్టి తీర్మానం"





**నేటిసాక్షి జగదేవపూర్ :** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం మునిగడప గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వహణను పూర్తిగా నిలిపివేయాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ముచపతి బాలయ్య, ఉప సర్పంచ్ మామిండ్ల కిషన్ యాదవ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో విస్తృత చర్చ అనంతరం మద్యనిషేధ తీర్మానాన్ని ఆమోదించారు. గ్రామంలో బెల్ట్ షాపుల వల్ల యువత చెడు అలవాట్లకు లోనవడం, కుటుంబాల్లో గొడవలు పెరగడం, శాంతిభద్రతలకు విఘాతం కలగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు, యువజన సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మద్యం విక్రయాలపై పూర్తి నిషేధం విధించాలని, అక్రమ విక్రయాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమోదించిన మద్యనిషేధ తీర్మానాన్ని ఎక్సైజ్ అధికారులకు అందజేశారు. గ్రామంలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధి, సామాజిక ప్రశాంతత కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ సర్పంచ్ బాలయ్య , ఉప సర్పంచ్ మామిండ్ల కిషన్ యాదవ్, వార్డు సభ్యులు బాలస్వామి, గుర్రం శ్రీధర్, జగదీష్, చందు, సలేంద్రి కరుణాకర్, కవిత గ్రామస్తులు, యువకులు, నాయకులు పాల్గొన్నారు.

## శ్రీశైలం పాదయాత్రికులకు అన్నదానం

మాండ్రా సేవదల్ భావన రాము,టీమ్



**నేటి సాక్షి పాములపాడు :** మండలం కేంద్రమైన ఎర్రగూడూరు నేషనల్ హైవే రహదారిలో జంబూల్లమ్మ దేవాలయం దగ్గర శ్రీశైలం వెళ్లే పాదయాత్రికులు, భక్తులకు మాండ్రా సేవదల్ భావన రాము టీమ్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్బంగా ఐదు రోజులు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చెయ్యడం అయ్యినది. ఇది రెండో సంవత్సరం కూడా ఏర్పాటు చెయ్యడం అయ్యినది. ఈ కార్యక్రమం మండలం సంస్కృతి అధ్యక్షులు భావన వినోద్, మిట్టకందల సీనియర్ నాయకులు సంజన్న, నియాజ్, రామకృష్ణ, బూత్ 206 ఇంచార్జి నాగశ్రీని వాసులు, పాల్గొని అన్నదానం ప్రారంభం చేసారు

## పోస్టల్ బీమా చెక్కు అందజేత.



**నేటి సాక్షి చిలుకూరు:** చిలుకూరు మండలం చేన్నారి గూడెం గ్రామానికి చెందిన బండ్ల హుస్సేన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందినాడు అతనికి పోస్టల్ బీమా ఉన్నందున భీమా నుంచి మంజూరైన పది లక్షల చెక్కును పోస్టల్ ఎస్పీ సంతోష్ కుమార్ నరహరి మృతుడి భార్య ప్రమీలకు చెక్కును అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యం కలిగి ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ సబ్ డివిజన్ పోస్టల్ మేనేజర్ లక్ష్మణ్ ఇన్స్పెక్టర్ సురేష్ సర్పంచ్ నాగేశ్వరావు గ్రామ కార్యదర్శి సౌరిక మాజీ సర్పంచ్ గంట శ్రీను పుట్టపాక నరసయ్య కొండలు బ్రాంచ్ పోస్ట్మాస్టర్లు పెండెం శ్రీనివాస్ రాజేష్ వెంకటేష్ నాగేశ్వరావు సిబ్బంది అశోక్ విజయ్ గ్రామ పెద్దలు అందరు పాల్గొన్నారు..

## పోరండ్ల సౌమ్యకు డాక్టరేట్




**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన పోరండ్ల ఉపేంద్ర కుమార్తె సౌమ్యకు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందినది ఈ మేరకు ఆమె మంగళవారం విలేకరులకు తెలిపారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ హైదరాబాద్ లో సాయిల్ సైన్స్ సబ్జెక్ట్ నుండి డాక్టర్ పట్టా పొందినట్టుగా ఆమె తెలిపారు.. సోమవారం యూనివర్సిటీలో స్నాన ఉత్సవ కార్యక్రమంలో డాక్టరేట్ పట్టా అందించినట్లుగా తెలిపారు. ఈ మేరకు ఆమె తల్లిదండ్రులు గ్రామ పెద్దలు ఆనందాన్ని వ్యక్తం చేశారు

# నాణ్యమైన భోజనం వడ్డించండి

- జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు



**నేటి సాక్షి పాములపాడు :** నాణ్యమైన భోజనం విద్యార్థినీలకు అందించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు కోరారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా పాములపాడు మండల కేంద్రంలోని ఉన్న కస్తూర్బా గాంధీ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ సంతృప్తి చెందుతూ ఈ సందర్భంగా లింగాల నాగరాజు మాట్లాడుతూ స్కూల్ నందు దాదాపుగా 260 మంది బాలికలు చదువుతున్నారని వీరికి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆయన అన్నారు.అదే మాదిరిగా వంట రూమును శుభ్రంగా ఉంచుకోవాలని వంట మనుషులు బాధ్యతగా వ్యవహరించి ఎలాంటి లోపం లేకుండా భోజనం గాని తాజా కూరగాయలతో కూరలు ఉండాలని అజాగ్రత్త చేస్తే సహించే పరిస్థితి లేదని ఆయన హెచ్చరించారు ప్రభుత్వం మంచి ఉద్దేశంతో సన్నబియాన్నే సరఫరా చేస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి చదువులు చదవాలని స్కూలుకు మంచి పేరు తేవాలని ఆయన అన్నారు భోజన విషయంలో ఎలాంటి లోపాలు జరిగినా జిల్లా కలెక్టర్ గారికి స్థానిక గౌరవ శాసనసభ్యులు గిత్త జయ సూర్య సారు గారికి ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు

## డిఎల్‌పిఓ చేతుల మీదుగా ఉత్తమ సేవ అవార్డు అందుకున్న చెలిమిళ్ళ పిఎస్ కృష్ణ ప్రియ..



**నేటి సాక్షి పాములపాడు :** పాములపాడు మండలం చెలిమిళ్ళ గ్రామపంచాయతీ కార్యదర్శి టి.కృష్ణప్రియ 2025-26 ఆర్థిక సంవత్సరానికి నందికొట్కూరు నియోజకవర్గంలో మొదటి స్థానంలో వందకు వంద శాతం ఇంటి పన్ను వసూళ్లు చేసిన సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కృష్ణ ప్రియ మేడం గారికి ఘనంగా డి జి పి ఓ లలితా బాయ్ శాలువాతో సత్కరించి,సన్మానించారు. ఆమె చేసిన ఉత్తమ సేవలకు పంచాయతీ రాజ్ కమిషనర్ నుండి మెమెరబుల్ । సర్టిఫికేట్ను నంద్యాల డిజిపిఒ పి.లలితా బాయ్, డిఎల్పిఒ డి.రాంబాబులు అందజేశారు. నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి ఆమె పని తీరును ప్రశంసించారు. చెలిమిళ్ళ పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ రెండు చెలిమిళ్ళ లింగాల గ్రామాల్లో వంద శాతం వసూలు చేసినందుకు నాకు డిఎల్పిఓ తోటి అధికారులు శాలువ కప్పి ,ఈ ప్రశంసా పత్రాన్నీ , అందించి ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ ప్రశంసా పత్రం అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. నా మీద విధి నిర్వహణలో ఇంకా మంచి సేవలను అందిస్తానని అన్నారు.మా కుటుంబ సభ్యులు స్నేహితులు శ్రేయోభిలాషులు చాలా సంతోషాన్ని వ్యక్తపరిచారు.

# పప్పు ధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



**నేటి సాక్షి జగదేవపూర్ :** జగదేవపూర్ మండలం ఆలీరాజపేట్ గ్రామంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త పల్లవి గారు మాట్లాడుతూ, మానవ ఆరోగ్యానికి అత్యంత ఆవశ్యకమైన ప్రోటీన్లు, ఫైబర్ మరియు విటమిన్లను అందించడంలో పప్పుధాన్యాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ముఖ్యంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, చక్కెర వ్యాధిని నియంత్రించడానికి మరియు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి ఇవి ఎంతో తోడ్పడతాయని తెలిపారు. పప్పుధాన్యాల సాగు కేవలం ఆరోగ్యాన్నే కాకుండా, భూమి సారాన్ని కూడా పెంచుతుందని, ఇవి నేలలో నత్రజనిని స్థిరీకరిస్తాయని పేర్కొన్నారు. రైతులు వరి, పత్తి వంటి పంటలకు బదులుగా లేదా వాటిలో అంతర పంటలుగా కందులు, మినుములు, పెసర్లు సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతు కిష్టయ్య పొలంలో చీదీవ+776 అనే నూతన శనగ రకాన్ని క్షేత్రస్థాయిలో ప్రదర్శించారు. ఈ కొత్త రకం నిటారుగా పెరగడం వల్ల యంత్రాలతో కోత కోయడానికి (Machine Harvesting) ఎంతో అనువుగా ఉంటుందని, ఇది ఎండు తెగులును తట్టుకోవడమే కాకుండా ఎకరానికి 8 నుండి 10 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుందని శాస్త్రవేత్త పల్లవి వివరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ఇటువంటి మేలైన పప్పుధాన్యాల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంత రావు, ఏఈఓ శరణ్య, గ్రామ సర్పంచ్ రాచమల్ల ఎల్లెష్ మరియు సుమారు 50 మంది స్థానిక రైతులు పాల్గొని సాగు పద్ధతులపై అవగాహన పెంచుకున్నారు.

# జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో.. కరపత్రం కలకలం.


మున్సిపల్ పట్టణ ప్రజలందరికీ ఆలోచింపజేసే విజ్ఞప్తి.

జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో ఈరోజు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న (35) అభ్యర్థులందరూ గతంలో ఏ పార్టీల్లో ఉన్నారో జగిత్యాల మున్సిపాలిటీ ప్రజలందరికీ బాగా తెలుసు. గత టీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 2019 మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి ఐదు సంవత్సరాలు అధికారాన్ని అనుభవించిన వారు, జగిత్యాల మున్సిపల్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అక్రమాలు, దందాలు చేసి 16 మంది మున్సిపల్ కమిషనర్లు మారేలా చేసిన ఘనమైన చరిత్ర వీరిదే. ఈరోజు అధికార దాహంతో ఊసరవెల్లిలా రంగులు మార్చుకుంటూ, నిన్నటిదాకా కాంగ్రెస్ పార్టీ గురించి ఒక్క మాట కూడా మాట్లాడని నాయకులు-నామినేషన్ రోజు కూడా మెడలో కాంగ్రెస్ పార్టీ కండువా లేకుండా, సంచుల ముటాలు అప్పజెప్పి బీ-ఫామ్ తెచ్చుకొని, ఈరోజు మాత్రం 'మాది కాంగ్రెస్ పార్టీ' అని చెప్పడం ఎంతవరకు సమంజసం? పార్టీకి సిగ్గు లేకపోయినా, సామాన్య ప్రజలమైన మనకైనా ఆలోచన ఉండాలి. అధికార దాహం కోసం రంగు మార్చే వ్యక్తికి మన విలువైన ఓటు ఇవ్వకూడదు. మన ఓటు రాజ్యాంగాన్ని కాపాడే ఆయుధం. కాబట్టి ఊసరవెల్లి రాజకీయాలను తిరస్కరించి, భారత రాజ్యాంగాన్ని కాపాడే నిర్ణయం తీసుకుందాం.

ఇట్లు,
ఒక సామాన్య ఓటర్ జగిత్యాల మున్సిపాలిటీ

- ఊసరవెల్లి రాజకీయాలపై సామాన్య ఓటర్ విజ్ఞప్తి
- మాజీ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ బీ-ఫామ్‌లతో పోటీ..
- జగిత్యాల ప్రజలు ఆలోచించాలి.!
- విచారిస్తున్న పోలీసులు.?

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** మున్సిపల్ ఎన్నికల వేళ సామాన్య ఓటర్ పేరుతో విడుదలైన కరపత్రం జగిత్యాలలో సంచలనం రేపుతోంది. గతంలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్)లో ఉండి అక్రమాలు చేసినవారు ఇప్పుడు కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారని ఆరోపణలు.. పోలీసులు విచారణ చేస్తున్న నేపథ్యంలో ఓటర్లు జాగ్రత్తగా ఆలోచించాలని విజ్ఞప్తి.!

### ఊసరవెల్లి రాజకీయాలపై తీవ్ర ఆరోపణలు

జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న 35 మంది అభ్యర్థుల గత చరిత్రను ఈ కరపత్రం బహిర్గతం చేసింది. గత టీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 2019 మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి ఐదేళ్లు అధికారం అనుభవించిన వీరు, మున్సిపాలిటీ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అక్రమాలు, దందాలు చేశారని ఆరోపణ. దీంతో 16 మంది మున్సిపల్ కమిషనర్లు మారిన ఘన చరిత్ర వీరిదే అని కరపత్రంలో పేర్కొన్నారు.

### అధికార దాహంతో రంగులు మార్చుకునే ఊసరవెల్లి రాజకీయాలు

అధికార దాహంతో ఊసరవెల్లిలా రంగులు మార్చుకుంటున్నారని విమర్శ. నిన్నటిదాకా కాంగ్రెస్ పార్టీ గురించి ఒక్కమాట కూడా మాట్లాడని నాయకులు, నామినేషన్ రోజు కూడా మెడలో కాంగ్రెస్ కండువా లేకుండా సంచుల ముటాలు అప్పజెప్పి బీ-ఫామ్ తెచ్చుకున్నారని ఆరోపణ. ఇప్పుడు 'మాది కాంగ్రెస్ పార్టీ' అని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

### ప్రజలకు విజ్ఞప్తి- ఓటు విలువ తెలుసుకోండి

పార్టీకి సిగ్గు లేకపోయినా, సామాన్య ప్రజలైన మనకైనా ఆలోచన ఉండాలని కరపత్రం సూచిస్తోంది. అధికార దాహం కోసం రంగు మార్చే వ్యక్తులకు విలువైన ఓటు ఇవ్వకూడదు. ఓటు రాజ్యాంగాన్ని కాపాడే ఆయుధమని, ఊసరవెల్లి రాజకీయాలను తిరస్కరించి భారత రాజ్యాంగాన్ని కాపాడే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### వైరలవుతోన్న కరపత్రం- విచారిస్తున్న పోలీసులు

ఈ కరపత్రం విడుదలైన నేపథ్యంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. జగిత్యాలలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. సామాన్య ఓటర్ పేరుతో వచ్చిన ఈ కరపత్రం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.!